క్లుప్తంగా

కరప హెచ్ఎంపై సస్పెన్షన్

కరప: మండలం గొర్రిపూడి జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం అడబాల కాశీవిశ్వేశ్వరరావుపై సస్పెన్షన్ వేటు పడింది. ఆయన కొంతకాలంగా తొమ్మిది, పదో తరగతి విద్యార్థులను వేధిస్తుండడంపై వారి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అధికారులు విచారణ జరిపిన విషయం తెలిసిందే. విచారణలో హెచ్ఎం వేధింపులకు పాల్పడినట్టు నిర్ధారణ కావడంతో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖాధికారులు హెచ్ఎం కాశీవిశ్వేశ్వరరావును సస్పెండ్‌చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సదరు హెచ్ఎంపై పోక్సో కేసు నమోదు చేసినట్టు తెలిసింది.

జంక్ ఫుడ్‌తో పిల్లల్లో ఊబకాయం



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న మల్లీశ్వరి

కాకినాడ రూరల్: ప్రస్తుత కాలంలో బాలలు అధిక కేలరీలు ఉన్న జంక్ ఫుడ్ ఎక్కువగా తీసుకోవడంతో ఊబకాయం బారిన పడుతున్నారని పోషకాహార నిపుణులు మల్లీశ్వరి ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఊబకాయం ఉన్న పిల్లలు చిన్నతనం నుంచి బరువు పెరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దీనిని అధిగమించడం కోసం పిల్లలకు ఆటల ద్వారా శారీరక శ్రమ కల్పించాలని సూచించారు. కొవ్వు పదార్థాలను పరిమితంగా తీసుకోవాలన్నారు. పండ్లు, కూరగాయలు, పప్పులు అధికంగా తీసుకోవాలని చెప్పారు.

వృద్ధాప్యంలో ప్రశాంతత అవసరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న కృష్ణమోహన్

కాకినాడ రూరల్: వృద్ధాప్యంలో సంతోషంగా, ప్రశాంతంగా గడిపేందుకు కృషి చేయాలని ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి జి.కృష్ణమోహన్ అన్నారు. అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక రమణయ్యపేటలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వృద్ధాప్యంలో సంతోషకరమైన జీవితం, ఆరోగ్యకరమైన జీవనశైలి అవసరమన్నారు. సాధించిన విజయాలతో, ఆర్జించిన సంపదతో సంతృప్తి చెంది, ఆత్మవిశ్వాసంతో మెలగాలన్నారు. శక్తికి మించిన ప్రయాసలకు గురికారాదన్నారు. రోజు వాకింగ్ చేయాలని, సానుకూల దృక్పథంతో, ఉత్సాహంతో ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు అడబాల రత్నప్రసాద్, ఎస్.శ్రీనగేష్, మల్లీశ్వరి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

కాకినాడ సిటీ: డెయిరీ ఫారం సబ్‌స్టేషన్ 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో లైన్ మరమ్మతులు, ట్రీ కటింగ్ కోసం శుక్రవారం ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రెవెన్యూ కాలనీ, ఇండస్ట్రియల్ ఈఎస్ఐ ఫీడర్ల లైన్లలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ కాకినాడ ఈఈ ఎస్.ఉదయ్‌భాస్కర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని కారణంగా రాజీవ్ గృహకల్ప, రెవెన్యూ కాలనీ ఏరియా, దుమ్ములపేట, మున్సిపల్ స్కూల్ ఏరియా, కొత్తపాకలు ఏరియాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని చెప్పారు.

ఇంటి పన్ను వసూళ్లపై దృష్టి సారించాలి



ఉప్పలంక పంచాయతీలో రికార్డులను పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ

కరప: గ్రామంలో పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహిస్తూ, ఇంటిపన్ను వసూళ్లపై కూడా దృష్టి సారించాలని ఈఓపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు ఆదేశించారు. ఉప్పలంక పంచాయతీని బుధవారం ఆయన సందర్శించి, రికార్డులు పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలిచ్చారు. గ్రామంలో ఇంటి పన్నులు రూ.6.17 లక్షలు వసూలు చేయాల్సి ఉండగా, ఇంతవరకు రూ.3.62 లక్షలు వసూలు చేసినట్టు పంచాయతీ కార్యదర్శి ఎం.భవాని తెలిపారు. మిగిలిన గృహ యజమానుల నుంచి కూడా ఇంటి పన్నులు వసూలు చేసి, నూరు శాతం పూర్తి చేయాలని ఈఓపీఆర్డీ ఆదేశించారు. అనంతరం పారిశుధ్య పనుల నిర్వహణను పరిశీలించారు. తర్వాత గ్రామస్తులతో కలిసి ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని సందర్శించారు. తడి-పొడి చెత్తను విడిగా సేకరించి, వర్మీ కంపోస్ట్ ఎరువును తయారు చేసే విధానాన్ని వివరించి, పంచాయతీకి ఆదాయాన్ని సమకూర్చుకోవాలని సూచించారు.

ఆస్పత్రి నుంచి ఇద్దరి డిశ్చార్జి

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న జీబీఎస్ వ్యాధి బాధితుల్లో ఇద్దరు కోలుకోవడంతో బుధవారం వారిని డిశ్చార్జి చేశారు. మరో వ్యక్తి చికిత్స పొందుతున్నట్టు ఆస్పత్రి అధికారులు తెలిపారు.

అభ్యుదయం.. ఆమె పథం

- ఉత్సాహంగా మహిళా దినోత్సవాలు
- వారోత్సవాల్లో అద్భుత ప్రణాళిక ఆచరణ
- ఘన స్వాగతం పలికేందుకు సమాయత్తం
- వెల్లివిరిసిన అతివల చైతన్యం



మహిళా క్రీడలు ప్రారంభిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ క్రైం: మహిళా చైతన్యం వెల్లివిరిసింది. మహిళా దినోత్సవం మురిసింది. వారం రోజుల వారోత్సవం అణువణువూ పులకింపజేస్తోంది. తరుణి ఉత్సాహాన్ని ఆవిష్కరించింది. అవగాహనా కార్యక్రమాలు, ఆటపాటలు, సభలు, సమావేశాలు, ర్యాలీలు, నినాదాలతో యావత్ సమాజ దృష్టిని తనవైపు తిప్పుకొంది మహిళా దినోత్సవ వేడుక. ఈ నెల 8వ తేదీన జరగనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవ సన్నాహకాలు అబ్బురపరిచాయి. కాకినాడ అర్బన్ ప్రాజెక్టు పరిధిలో ఐసీడీఎస్ పీడీ విజయకుమారి పర్యవేక్షణలో సీడీపీవో జ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వారోత్సవాలు మహిళల్లో స్ఫూర్తి నింపాయి.

ప్రణాళికాబద్ధంగా ఆచరణ

మహిళా దినోత్సవానికి ఘన స్వాగతం పలికేందుకు సెక్టార్ అద్భుత రీతిలో సమాయత్తమైంది. కలెక్టర్ షణ్మోహన్ ఆదేశాలతో పీడీ విజయకుమారి పర్యవేక్షణలో సీడీపీవో జ్యోతి తన పరిధిలోని 253 సెంటర్లలో పనిచేస్తున్న ఆరుగురు సూపర్‌వైజర్లు, 251 మంది వర్కర్లు, 236 మంది హెల్పర్లు ఏకతాటిపై నిలిచి వారోత్సవాలను అబ్బురపరిచే రీతిలో కొనసాగిస్తున్నారు.

ఎలా చేశారంటే..

ఈ నెల ఒకటి నుంచి ఏడో తేదీ వరకు వారోత్సవ ప్రణాళిక అమలు కానుంది. నిర్దేశిత ప్రణాళికను అనుసరించి..

- ఒకటిన బేటీ పఢావో బేటీ బచావో సందేశంతో ప్రాజెక్టు స్థాయిలో అన్ని డిపార్ట్‌మెంట్ల మహిళా ఉద్యోగులు, కిశోర బాలికలతో సైకిల్ ర్యాలీలు, ఆడపిల్లల పుట్టిన రోజులుంటే కేక్ కట్ చేయించి, వారి పేరుతో మొక్కలు నాటారు. అలాగే జిల్లా పోలీస్ శాఖ సమన్వయంతో మహిళా రక్షణ, భద్రతలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.
- రెండున ఆదివారమైనా మహిళా దినోత్సవ ప్రాధాన్యంపై అంగన్‌వాడీలు, ఆయాలతో అవగాహన కల్పించారు. వారు తమ వద్దకు వచ్చే కిశోర బాలికలు, తల్లులు, గర్భిణులకు ఆయా అంశాలపై అవగాహన కల్పించాలన్నదే ప్రధానోద్దేశం.
- మూడున బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులకు అవగాహనా సదస్సులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టీచర్లు, తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించారు. సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.
- నాలుగున సెక్టార్ల పరిధిలో ఫుడ్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. మై ప్లేట్ కాన్సెప్ట్‌ను రూపకల్పన చేసి పోషకాహార ప్రాధాన్యాన్ని వివరించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు తీసుకోవలసిన ఆహార పదార్థాలపై అవగాహన పెంపొందించారు.
- ఐదున బుధవారం కాకినాడలోని స్థానిక జగన్నాథపురంలో అన్నవరం సత్యదేవి మహిళా డిగ్రీ కళాశాలలో ప్రముఖ మనస్తత్వ నిపుణుడు, ఇంపాక్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ధనుంజయ్ రాజు విద్యార్థినులతో మమేకమయ్యారు. విద్యార్థినుల భవితను నిర్దేశించే విలువైన సూచనలతో మహిళా దినోత్సవానికి ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమాన్ని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు.
- ఆరున ప్రాజెక్టు స్థాయిలో ఆటల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారు. న్యూట్రీషియనిస్టుతో పోషకాహారంపై అవగాహన కల్పిస్తారు. యోగా తరగతులు నిర్వహిస్తారు. ఆయా కార్యక్రమాలు సీడీపీవో జ్యోతి ఆధ్వర్యంలో కాకినాడలోని డెయిరీ ఫారం సెంటర్‌లోని ఐసీడీఎస్ కార్యాలయంలో జరుగుతాయి.
- ఏడున వారోత్సవాల చివరి రోజున మహిళల హక్కుల కోసం నినదిస్తూ 2కె మారథాన్ నిర్వహిస్తారు. గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టంపై అవగాహన కల్పిస్తారు.

అన్ని విభాగాలు ఏకమై..

మహిళలను చైతన్యవంతుల్ని చేసి ఈ ఏడాది అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఓ మధురానుభూతిగా తీర్చిదిద్దేందుకు నిర్దేశించిన వారోత్సవాల ఉత్సాహం అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విభాగాలకు చెందిన మహిళల మనసుల్ని స్పృశించింది. అవగాహనా కార్యక్రమాలు, ఆటపాటలతో వారెవ్వా అనిపించారు. డీఎస్ఏ మైదానమైతే మహిళల ఆటపాటలు, కేరింతలతో పండగ వాతావరణాన్ని తలపిస్తోంది. కలెక్టర్ షణ్మోహన్ సగిలి కాకినాడలోని డీఎస్ఏ మైదానంలో నిర్వహించిన ఈ క్రీడా పోటీలను ప్రారంభించారు. మహిళా దినోత్సవ ప్రాధాన్యాన్ని వివరిస్తూ ఉపన్యాసమిచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలతో పాటు, ఏపీ ఎన్‌జీవో నేతలు పాల్గొన్నారు.



కిశోర బాలికలతో మహిళా భద్రతా ప్రమాణం చేయిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది



విద్యార్థినుల సైకిల్ ర్యాలీ



బాలల పుట్టిన రోజు వేడుకలు నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది



పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటుతూ..

మహిళా దినోత్సవంపై ఉన్నత స్థాయి సమీక్ష

- కలెక్టర్లతో మంత్రుల వీడియో కాన్ఫరెన్స్
- యంత్రాంగానికి దిశానిర్దేశం చేసిన కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: మహిళా దినోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. బుధవారం అమరావతి నుంచి రాష్ట్ర సచివాలయం రాష్ట్ర మహిళా సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి, మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సూర్యకుమారితో కలిసి తన కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు కాకినాడ కలెక్టరేట్ నుంచి కలెక్టర్ షణ్మోహన్, అధికారులతో కలిసి హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులతో జిల్లాలో నిర్వహించనున్న మహిళా దినోత్సవ ఏర్పాట్లపై సమీక్షించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర స్థాయితో పాటు జిల్లా స్థాయిలో ఈ నెల 8వ తేదీన కాకినాడ నగర పాలక సంస్థ స్మార్ట్ సిటీ సమావేశపు మందిరంలో మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా లక్‌పతి దీదీస్ అనే పేరుతో జిల్లా వ్యాప్తంగా ఉన్న మహిళా పారిశ్రామికవేత్తలను, క్రీడాకారిణులను, చేనేత మహిళా కళాకారులు, ఇతర రంగాల్లో రాణిస్తున్న మహిళలను సత్కరించేలా అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. మహిళా దినోత్సవ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం అయ్యేలా చూడాలన్నారు. మహిళల్లో చైతన్యం కలిగించేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. దీనికి సంబంధించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమాలు సక్రమంగా జరిగేలా వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, ఐసీడీఎస్ పీడీ విజయకుమారి, డీఆర్‌డీఏ పీడీ ఎ.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు సత్కారం



కండక్టర్ మూర్తిని సత్కరిస్తున్న డీఎం మనోహర్, అధికారులు

బాలాజీచెరువు: ఏపీఎస్ఆర్టీసీ కాకినాడ డిపోకు అధికాదాయం సమకూర్చి, ప్రయాగరాజ్‌లో జరిగిన కుంభమేళాకు 12 బస్సులు నడపడంలో కీలక పాత్ర పోషించిన ఉద్యోగులను ఆర్టీసీ డిపో మేనేజర్ ఎంయూవీ మనోహర్ జ్ఞాపికలతో సత్కరించారు. జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో బుధవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇటీవల ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగరాజ్‌లో జరిగిన మహా కుంభమేళాకు 12 బస్సులు నడపడంలో కీలకపాత్ర పోషించిన మార్కెటింగ్ సిబ్బంది బీవీఎస్ఎన్ రెడ్డి, ఎంఆర్ఎల్ స్వామి, డ్రైవర్లు కేఎస్ రావు, బి.రామును దుశ్శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. ఫిబ్రవరిలో అధికాదాయం తెచ్చిన కండక్టర్లు వీఎస్ మూర్తి, టీఆర్ లక్ష్మి, ఎన్‌జే రావు, డ్రైవర్లు జీవీ రమణ, వైజీకే చౌదరి, వీఎస్ కుమార్‌ను ఎం.శ్రీనివాసరావు సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ సిటీ బాలకృష్ణ, డీపీడీవో ఆఫీస్ అసిస్టెంట్ మేనేజర్ ఎస్‌కేఎం బాష, అసిస్టెంట్ ఇంజినీర్ కె.ప్రభాకరరావు, స్టేషన్ మేనేజర్ వి.ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

డిసోసియేటివ్ ఐడెంటిటీ డిజార్డర్‌పై అవగాహన



వైద్య నిపుణుడు కాటన్‌ను అభినందిస్తున్న డాక్టర్ అడ్డాల

బోట్‌క్లబ్: విభిన్న వ్యక్తిత్వ అసమతుల్యత (డిసోసియేటివ్ ఐడెంటిటీ డిజార్డర్-డీఐడీ)పై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని ప్రముఖ మానసిక వైద్య నిపుణుడు కాటన్ అన్నారు. ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కరణం గారి జంక్షన్ వద్ద ఉన్న ప్రజ్ఞ మానసిక వైద్యశాలలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఐడీ ఉన్న వ్యక్తులు గుర్తింపులో అంతరాయాలు, జ్ఞాపకశక్తిని కోల్పోవడం, భావోద్వేగ నిర్లిప్తత, బహుళ విభిన్న వ్యక్తిత్వ స్థితులను కలిగి ఉంటారని విశ్లేషించారు. డీఐడీ అనేది తీవ్రమైన మానసిక ఆరోగ్య పరిస్థితి అన్నారు. డీఐడీ ఉన్న వ్యక్తులు రెండు లేదా అంతకంటే ఎక్కువ ప్రత్యేక వ్యక్తిత్వ స్థితులను అనుభవిస్తారని, ప్రతి ఒక్కటి వారి సొంత ప్రత్యేకమైన ప్రవర్తనలు, భావోద్వేగాలు, జ్ఞాపకాలతో ముడిపడి ఉంటాయని వివరించారు. ఇది తరచుగా తీవ్రమైన బాల్య గాయంతో ముడిపడి ఉంటుందన్నారు. ఈ పరిస్థితికి పూర్తి నివారణ ఎల్లప్పుడూ సాధ్యం కాకపోవచ్చని, ముందస్తు జోక్యం, మానసిక ఆరోగ్య మద్దతు, మంచి సౌకర్యమైన వాతావరణంలో ఉండటం వంటివి అది వృద్ధి కావడాన్ని తగ్గిస్తుందని చెప్పారు. అనంతరం కాటన్‌ను సంఘ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ అడ్డాల సత్యనారాయణ సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పరివర్తనలో మీనాక్షి చౌదరి జన్మదిన వేడుకలు



పరివర్తనలో విద్యార్థులతో సినీ నటి మీనాక్షి చౌదరి

బోట్‌క్లబ్: ప్రముఖ సినీనటి మీనాక్షి చౌదరి బుధవారం తన పుట్టిన రోజు వేడుకలను స్థానిక పరివర్తన వీధిబాలల పునరావస కేంద్రంలో జరుపుకొన్నారు. ఇక్కడ పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని ఆమె చెప్పారు. ఇక్కడ విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా ఉన్నారని, వారందరికీ మంచి భవిష్యత్తు ఉండాలని ఆకాంక్షించారు. పరివర్తన నిర్వహణ బాగుందని కారదర్శి వక్కలంక రామకృష్ణను అభినందించారు. అనంతరం విద్యార్థుల మధ్య ఆమె కేక్ కట్ చేసి, పుట్టిన రోజు వేడుకలు జరుపుకొన్నారు. తొలుత ఆమెకు విద్యార్థులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు చెలికాని సూర్యారావు, సిబ్బంది పాల్గొన్నారు.

భవన్నారాయణస్వామి సన్నిధిలో..

కాకినాడ రూరల్: సర్పవరంలోని రాజ్యలక్ష్మి సమేత శ్రీ భావన్నారాయణ స్వామి ఆలయాన్ని సినీ హీరోయిన్ మీనాక్షి చౌదరి బుధవారం ఉదయం సందర్శించారు. ఆలయంలో స్వామివారిని దర్శించుకున్న అనంతరం అర్చకులు ఆమెకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. స్వామి వారి ఆలయ చరిత్ర అర్చకుల ద్వారా తెలుసుకున్నారు. ఇటీవల విడుదలైన 'సంక్రాంతికి వస్తున్నాం...' చిత్రంలో హీరోయిన్‌గా నటించిన మీనాక్షి చౌదరిని చూసేందుకు గ్రామస్తులు తరలివచ్చారు.

భుక్తి కోసం గంగపుత్రులు.. కూటి కోసం పక్షులు




సాగర తీరాన ఆహారాన్వేషణలో కృష్ణ పక్షులు, వేటాడిన చేపలను ఒబ్బిడి చేసుకుంటున్న మత్స్యకారులు

కాకినాడ రూరల్: సకల జీవులు కూటి కోసం పాట్లు పడాల్సిందే. ఆహారం లేనిదే ప్రాణుల మనుగడ సాగించలేవు. ఆకాశంలో రివ్వును ఎగిరే పక్షయినా.. నీటిలో తిరిగే చేపయినా.. వాటికి అందుబాటులో ఉన్న ఆహారం కోసం అన్వేషణ సాగిస్తాయి. కాకినాడ సాగర తీరాన కుంభాభిషేకం వద్ద బుధవారం సాయంత్రం కనిపించిన దృశ్యమిది. వేకువజామునే సముద్రంలోకి వేటకు వెళ్లి వలకు చిక్కిన చేపలను ఒబ్బిడి చేసుకుంటూ, కూటి కోసం గంగపుత్రులైన మత్స్యకారులు పాట్లు ఒకవైపు, ఆకాశంలో ఎత్తున ఎగిరే కృష్ణ గెద్ద పక్షులు తమ కూటి కోసం మత్స్యకార బోట్లకు సమీపంలో చక్కర్లు కొడుతూ ఇలా దర్శనమిచ్చాయి.

మద్యం దుకాణాలకు నేడు లాటరీ

కాకినాడ క్రైం: కాకినాడ జిల్లాలో శెట్టిబలిజ, గౌడ్, గౌడ కులస్తులకు నిర్దేశించిన 16 మద్యం దుకాణాల కేటాయింపునకు నిర్వహించే లాటరీ ప్రక్రియ గురువారం జరగనుంది. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉన్న వివేకానంద హాల్‌లో కలెక్టర్ షణ్మోహన్ పర్యవేక్షణలో ఉదయం 9 నుంచి ఈ ప్రకియ ప్రారంభం కానుంది. దరఖాస్తుదారులు ఆధార్ కార్డు, ఎంట్రీ పాస్‌తో ఉదయం 8 గంటలకు కలెక్టరేట్‌కు చేరుకోవాలని అధికారులు తెలిపారు.

నేటి నుంచి విగ్రహాల పునః ప్రతిష్ఠ పూజలు



విద్యుద్దీప కాంతులతో రామాలయం

కాకినాడ రూరల్: సర్పవరం గ్రామంలోని రామాలయంలో హనుమ, లక్ష్మణ సహిత సీతారామచంద్రస్వామివిగ్రహాల పునః ప్రతిష్ఠకు పూజా కార్యక్రమాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. పురాణం రామకృష్ణమాచార్యులు, వెంకటాచార్యుల ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు మహాకుంభ సంప్రోక్షణ నిర్వహించనున్నారు. 8న త్రిదండి చిన్నశ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి చేతుల మీదుగా జీర్ణోద్ధరణ ప్రయుక్త ఆలయ మహా కుంభ సంప్రోక్షణ చేయనున్నారు. తొలి రోజు విష్వక్సేన ఇష్టి, సాయంత్రం అంకురారోపణ వంటి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తొలి రోజు పూజా కార్యక్రమాలను భీమవరం త్రిదండి రామచంద్ర జీయర్ స్వామి, గోవింద స్వామి, అహోబిల రామానుజ జీయర్ స్వామి ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరుగుతాయి.

లోన్లు ఇప్పిస్తామని మోసం

కాకినాడ క్రైం: ఇన్ఫినిట్ గ్రూప్ పేరుతో లోన్లు ఇప్పిస్తామని ఓ ముఠా మోసానికి పాల్పడింది. కాకినాడలో జరిగిన ఈ మోసానికి సంబంధించిన వివరాలివీ. సామర్లకోట మండలం పనసపాడు గ్రామానికి చెందిన కందికట్టు శిరీష అలియాస్ ప్రియాంక కొన్నాళ్లుగా ఇన్ఫినిట్ గ్రూప్ పేరుతో లోన్లు ఇప్పిస్తామని ప్రజల్ని మోసం చేస్తోంది. ఆధార్, పాన్‌కార్డులు, బ్యాంక్ చెక్కులు తీసుకుని, రూ.5 వేల చొప్పున ఫీజుగా వసూలు చేస్తోంది. ఎన్నాళ్లు గడిచినా లోన్‌పై సమాధానం ఇవ్వకుండా తప్పించుకుంటోంది. ఈ నేపథ్యంలో పలువురి బాధితుల ఫిర్యాదుతో కాకినాడ త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. బుధవారం డెయిరీ ఫారంలో ఉన్న ఇన్ఫినిట్ కార్యాలయంలో శిరీషతో పాటు, ఆమెకు సహకరించిన చెట్ల సూర్యవెంకట రమణను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

వేట్లపాలెంలో ఇద్దరు ఉపాధ్యాయుల సస్పెన్షన్

సామర్లకోట: మండల పరిధిలోని వేట్లపాలెం జెడ్పీ హైస్కూల్‌లో ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులిచ్చినట్టు ఎంఈఓ-2 పి.పుల్లయ్య తెలిపారు. పాఠశాలలో విద్యార్థులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారనే ఫిర్యాదుల మేరకు ఐసీడీఎస్ పీడీ విజయకుమారి, సీడీపీఓ ఉష, ఎంఈఓ-2 పుల్లయ్య, జీసీపీఓ ఉమామహేశ్వరి సోమవారం విచారణ చేసిన విష యం విదితమే. బాలురతో అసభ్యంగా ప్రవర్తించిన సోషల్ టీచర్‌ను, ఉపాధ్యాయులను, విద్యార్థులను మభ్యపెట్టి తప్పుడు ఫిర్యాదు చేయించిన హిందీ టీచర్‌ను సస్పెండ్ చేస్తూ, పాఠశాలకు ఉత్తర్వులు వచ్చినట్టు ఎంఈఓ తెలిపారు. ఉత్తర్వులు తీసుకునే సమయంలో సోషల్ టీచర్‌కు ఫిట్స్ రావడంతో సామర్లకోట ప్రభుత్వాస్పత్రికి తరలించినట్టు ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య తెలిపారు. విచారణలో తనను ఇరికించారని ఆరోపిస్తూ హిందీ టీచరు సస్పెన్షన్ కాపీని తీసుకోవడానికి నిరాకరించినట్టు తెలిసింది. దీనిపై వేట్లపాలెం జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం అనురాధను వివరణ కోరగా సోషల్ టీచరు ఆస్పత్రిలో ఉండడంతో పోస్టులో కాపీని పంపుతామని తెలిపారు. ఈ విషయాన్ని డీఈఓకు చెప్పగా, సస్పెన్షన్ కాపీ అందజేత నిలిపివేయాలని సూచించినట్టు హెచ్ఎం చెప్పారు.

సెల్‌ఫోన్ల రికవరీ

సామర్లకోట: మహా శివరాత్రి సందర్భంగా దొంగతనాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉన్నందున పోలీసు అధికారులు అనేక ప్రదేశాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఉత్సవాల నేపథ్యంలో బస్సు కాంప్లెక్స్‌లో సెల్‌ఫోన్లు చోరీకి గురైనట్టు వచ్చిన ఫిర్యాదుల మేరకు సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితులను పోలీసులు గుర్తించారు. వారి వద్ద నుంచి రికవరీ చేసిన సెల్‌ఫోన్లను బుధవారం ఫిర్యాదుదారులకు అందజేసినట్లు సీఐ తెలిపారు.